నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్

5 | నిజామాబాద్, గురువారం 18 జనవరి 2024 | ADILABAD

## నిపానిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

భీంపూర్, జనవరి 17 : మండలంలోని నిపాని గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ముగిశాయి. శ్రీ గోదాదేవి-రంగనాథుల కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులతో నిర్వహించిన శోభాయాత్ర కనులపండువగా కొనసాగింది.


కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

## ఆలయాన్ని శుభ్రం చేసిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 : ఈనెల 22వ తేదీన అయోధ్యలోని శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆలయంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని అతి పురాతనమైన సీసీఐ శ్రీసీతారామ ఉమా శంకర్ దేవాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆలయాన్ని శుభ్రం చేశారు.


పరిశుభ్రత పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

## 'ఆన్‌లైన్'లో సైన్స్ ఫెయిర్

- ఈనెల 20వ తేదీ వరకు గడువు
- నిర్మల్ జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్

నిర్మల్ అర్బన్, జనవరి 17 : నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ సంవత్సరం జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ఇన్‌చార్జి డీఈవో ప్రణిత, జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ పద్మలు ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిబిట్, ప్రాజెక్టులను తీసుకొచ్చే వారు ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సొసైటీకి సంబంధించిన సబ్ థీమ్స్, హెల్త్, లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, అగ్రికల్చర్, కమ్యూనికేషన్ అండ్ ట్రాన్స్‌పోర్ట్, కమ్యూనికేషన్ థింకింగ్ ప్రాజెక్టులను తీసుకురావాలని తెలిపారు. జూనియర్స్ విభాగంలో 6-8వ తరగతి విద్యార్థులు, సీనియర్స్ విభాగంలో 9-12వ తరగతి విద్యార్థులు సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల సహకారంతో ప్రదర్శనలు చేయాలని, పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వివరాల కోసం 9440069830, 9440786515, 9441172879 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.


పన్నుల వసూలు వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

## పన్నులు వసూలు చేయండి..

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్
- 'నమస్తే' కథనానికి స్పందన

నిర్మల్ అర్బన్, జనవరి 17 : నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ సెక్షన్‌ను బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బల్దియాలో 'ఆస్తుల జప్తు'నకు రంగం సిద్ధం పేరిట 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. 42 వార్డులో పేరుకుపోయిన బకాయిలను వసూలు చేయాలని, మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. గడువు లోగా 100 శాతం పన్నులను వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

● ఇదేనా మార్పు..

# ధాన్యం డబ్బులేవి..?

**రైతుల ఖాతాల్లో జమకావాల్సిన పైసలు రూ.123.72 కోట్లు**

- కేసీఆర్ సర్కార్ హయాంలో 24 గంటల్లోపే వచ్చిన డబ్బులు
- ప్రస్తుతం ధాన్యం విక్రయించి పది రోజులు గడిచినా దిక్కులేదు..
- రాకుండా పోయిన రైతుబంధు
- రైతుల నడ్డి విరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



మంచిర్యాల, జనవరి 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ రైతులను గోస పెడుతున్నది. రైతుబంధు పెంచుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపుతున్నది. ఇప్పుడేమో ధాన్యం కొనుగోళ్లు ముగిసి పది రోజులు గడిచినా.. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం లేదు. సాగు చేసేందుకు పెట్టుబడి సాయం ఇవ్వలేదు సరే.. ఆరుగాలం కష్టపడి, రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన ధాన్యం డబ్బులను కూడా ఖాతాల్లో వేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ సర్కార్ ఉన్నప్పుడు పంట కాలం వచ్చిందంటే చాలు దుక్కి దున్నుకునే టైమ్‌కు రైతుబంధు ఇచ్చింది. ఇప్పుడేమో పంటలు వేసి నెల గడుస్తున్నా ఎకరం పొలం ఉన్న రైతుకు కూడా పెట్టుబడి సాయం అందించలేని దుస్థితి. అప్పుడేమో 24 గంటల కరెంట్ ఉంటే.. ఇప్పుడేమో 18 గంటల కరెంట్.. అప్పుడేమో ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడితే ఇప్పుడేమో వారం, పది రోజులు అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. కాంగ్రెసోళ్లు తీసుకొస్తామని చెప్పిన మార్పు ఇదేనా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

### మంచిర్యాలలో చెల్లించాల్సిన డబ్బులు అధికం

మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో వరి అధికంగా సాగు చేస్తారు. ఈ రెండు జిల్లాల్లో రైతులకు ధాన్యం డబ్బులు జమ చేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నది. నిర్మల్ జిల్లాలో ఆలస్యంగా మేల్కొన్న అధికారులు గడిచిన నాలుగైదు రోజుల్లో క్లియర్ చేశారు. మంచిర్యాల జిల్లా రైతులకు మాత్రం పది రోజులు అవుతున్నా కొందరికీ డబ్బులు రాలేదు. మంచిర్యాల జిల్లాలోనే 7,023 మందికి రూ.102.98 కోట్లు, నిర్మల్‌లో 1,146 మందికి రూ.12.77 కోట్లు, ఆదిలాబాద్‌లో 106 మందికి రూ.46.88 లక్షలు, ఆసిఫాబాద్‌లో రూ.7.5 కోట్లు చెల్లించాలి.


మంచిర్యాలలో ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

### ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు

| జిల్లా | ధాన్యం విక్రయించిన రైతులు | జమ కావాల్సిన డబ్బులు | జమైనవి |
|---|---|---|---|
| మంచిర్యాల | 20,374 | రూ.300.14 కోట్లు | రూ.197.16 కోట్లు |
| నిర్మల్ | 34,899 | రూ.313.36 కోట్లు | రూ.300.59 కోట్లు |
| ఆసిఫాబాద్ | 780 | రూ.12 కోట్లు | రూ.4.5 కోట్లు |
| ఆదిలాబాద్ | 560 | రూ.4.78 కోట్లు | రూ.4.31 కోట్లు |
| మొత్తం | 56,613 | రూ.630.28 కోట్లు | రూ.506.56 కోట్లు |

### 25 రోజులైనా పైసలు రాలేదు..



*ఉట్నూర్ రూరల్, జనవరి 17 : వర్షాకాలంలో ఎనిమిదెకరాల్లో వరి వేశా. మా గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో 25 రోజుల క్రితం 161 క్వింటాళ్ల వడ్లు అమ్మిన. అధికారులేమో అమ్మిన వారం లోపు డబ్బులు వస్తాయని చెప్పారు. రెండు రోజులకోసారి బ్యాంకుకు వెళ్లి చూసుకుంటున్నా. ఇప్పటివరకు కూడా జమ కాలేదు. కూలీలు, వరి కోత యంత్రం యజమానికి, మందుల దుకాణంలో పైసలు కట్టేది ఉంది. సానా ఇబ్బంది అయితండి. కేసీఆర్ సార్ ఉన్నపుడు ఇట్ల లేకుండే. అమ్మిన 24 గంటల్లో డబ్బులు వస్తుండే. వడ్ల డబ్బులు త్వరగా ఇవ్వాలి.*

**- భక్తు స్వామి, రైతు, గంగన్నపేట్, ఉట్నూర్ మండలం.**

## గోదాముల నిర్మాణం..
# రైతులకు వరం..

- ఆదిలాబాద్ జిల్లాలో తొమ్మిది గిడ్డంగులు
- రూ.22.50 కోట్లతో నిర్మాణాలు
- పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం

ఆదిలాబాద్, జనవరి 17(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో పత్తితోపాటు సోయా, కంది అధికంగా సాగు చేస్తారు. వీటి ఉత్పత్తులకు మార్కెట్‌లో ధర లేనప్పుడు నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం గోదాములను(గోడౌన్స్) నిర్మించింది. ప్రస్తుతం సీడబ్ల్యూసీ, ఎఫ్‌సీఐలకు చెందిన 30 గిడ్డంగులు ఉండగా.. వాటిలో 24,460 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఈ గోదాములు సరిపోకపోవడంతో ప్రైవేట్ భవనాలను అద్దెకు తీసుకుని నిల్వ చేసుకునేవారు. అద్దెభారం పెరిగిపోవడంతో ఆరేండ్ల క్రితం కేసీఆర్ సర్కారు రూ.22.50 కోట్లతో 45 వేల మెట్రిక్ టన్నుల(మె.ట.)సామర్థ్యం గల తొమ్మిది గోదాములను నిర్మించింది. ఇచ్చోడ మార్కెట్ యార్డులో రూ.1.50 కోట్లతో 2,500 మెట్రిక్ టన్నులు, నార్నూర్‌లో రూ.3 కోట్లతో 5 వేలు, బేలలో రూ.3 కోట్లతో 5 వేలు, బోథ్‌లో రూ.3 కోట్లతో 5 వేలు, తలమడుగులో రూ.3 కోట్లతో 5 వేలు, తాంసి మండలంలోని బండల నాగాపూర్‌లో రూ.3 కోట్లతో 5 వేలు, ఇంద్రవెల్లి మండలంలోని ధనోరలో రూ.3 కోట్లతో 5 వేలు, గుడిహత్నూర్ మండలంలోని కొల్హారిలో రూ.3 కోట్లతో 5 వేలు, ఉట్నూర్‌లో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు నిర్మించారు.


తాంసి మండలంలోని బండలనాగాపూర్‌లో నిర్మించిన గోదాం

### పంట ఉత్పత్తుల నిల్వలకే..

కేసీఆర్ ప్రభుత్వం పంట ఉత్పత్తులను నిల్వ చేసుకుని గిట్టుబాటు ధరకు విక్రయించేలా గోదాముల నిర్మాణాన్ని చేపట్టింది. రైతుబంధు పథకంలో భాగంగా గోదాముల్లో నిల్వ ఉంచిన ఉత్పత్తులకు పంట విలువలో 75 శాతం లేదా రూ.2 లక్షల వరకు రుణం పొందవచ్చు. దీంతోపాటు ఆయిల్, మార్క్‌ఫెడ్, సీసీఐ అధికారులు పంటలను కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చు.మద్దతు ధరతో కొనుగోలు చేసిన ఉత్పత్తులు, రైల్వే వ్యాగన్ల ద్వారా వచ్చిన ఎరువులను కూడా నిల్వ చేసుకునే అవకాశం ఉంది.

## 'హిట్ అండ్ రన్' చట్టాన్ని రద్దు చేయాలి..

ఎదులాపురం, జనవరి 17 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'హిట్ అండ్ రన్' చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సో ఉల్లాఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్ కార్యాలయం నుంచి తాంసి బస్టాండ్, ఎన్టీఆర్ చౌక్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మద్ అన్సర్, ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్ పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వర్కర్స్ సభ్యులు


కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

### ఆగని ఆందోళన

నిర్మల్ అర్బన్, జనవరి 17 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'హిట్ అండ్ రన్' చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ లారీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న దీక్ష కొనసాగుతున్నది. స్థానిక శాంతినగర్ చౌరస్తాలో వారం రోజులుగా నిరసన చేపడుతున్నారు. బుధవారం వరకు తమ సమస్యలను పరిష్కరిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపిందని, పరిష్కారం దిశగా అడుగులు పడకపోవడంతో గురువారం నుంచి సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. కార్యాచరణను ప్రకటించి ఆ దిశగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని డ్రైవర్లు రమేశ్, నరేందర్, యూనియన్ సభ్యులు తెలిపారు.



కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయం

## ఈ నెల 20న నవోదయ ప్రవేశ పరీక్ష

**80 సీట్ల కోసం 4,458 మంది దరఖాస్తు**

కాగజ్‌నగర్, జనవరి 17: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్ష ఈ నెల 20న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి 4,458 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి 983 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్మల్ జిల్లా నుంచి 1,208 మంది దరఖాస్తు చేసుకోగా, 6 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మంచిర్యాల జిల్లా నుంచి 1,188 మంది విద్యార్థులకు ఏడు పరీక్షా కేంద్రాలు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 1,079 మందికి ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ సోయం, ఎమ్మెల్యేలు బొజ్జు, అనిల్ జాదవ్


విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తూ..


నృత్యం చేస్తున్న విద్యార్థినులు


రన్నింగ్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు


ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తూ..


జెండా ఎగురవేస్తున్న ఎంపీ బాపురావ్

## అట్టహాసంగా..

- రాష్ట్రస్థాయి పోటీలను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు
- ఆణిముత్యాలను వెలికి తీసేందుకే క్రీడలు : ఎంపీ సోయం
- క్రీడలకు ప్రోత్సాహం అందిస్తాం.. : ఎమ్మెల్యే బొజ్జు
- జాతర్లలో కూడా క్రీడలు నిర్వహించాలి : ఎమ్మెల్యే జాదవ్

ఉట్నూర్, జనవరి 17 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పట్టణంలోని కుమ్రం భీం(కేబీ) ప్రాంగణంలో బుధవారం గురుకులాల ఇంటర్ సొసైటీ లీగ్(ఐసీఎల్) రాష్ట్రస్థాయి పోటీలను ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, జాదవ్ అనిల్‌కుమార్‌తో కలిసి ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాజ్యోతిని వెలిగించడంతోపాటు విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ఆణిముత్యాలను వెలికి తీసేందుకే రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో గ్రామస్థాయి క్రీడలను ప్రోత్సహించేందుకు ఫిబ్రవరిలో సంసద్ ఖేల్ నిర్వహించనున్నామన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. కేజీబీవీ, గురుకులాలను అప్‌గ్రేడ్ చేయాలని గురుకులాల డైరెక్టర్‌ను కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడలకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మాట్లాడుతూ.. బోథ్ నియోజకవర్గంలోని జాతర్ల గ్రామంలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడాపాఠశాలలో కూడా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించాలని కోరారు. అనంతరం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకులాల డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, మాజీ ఎంపీ నగేశ్ పాల్గొన్నారు.


నాగోబా ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

## ఇంద్రవెల్లిలో ఎస్పీ సుడిగాలి పర్యటన

ఇంద్రవెల్లి, జనవరి 17 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో బుధవారం ఎస్పీ గౌస్ ఆలం సుడిగాలి పర్యటన చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అమరవీరుల స్తూపాన్ని సందర్శించి ఏప్రిల్ 20, 1980లో జరిగిన ఘటన గురించి తెలుసుకున్నారు. అక్కడి నుంచి కేస్లాపూర్‌లో గల నాగోబాను దర్శించుకుని పూజలు చేశారు. జాతరతోపాటు ఉత్సవాలు, మహాపూజ, సంప్రదాయాలు, ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీని మెస్రం వంశీయులు సన్మానించి, నాగోబా ఫొటోను బహూకరించారు. ఆయన వెంట ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ సునీల్, మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ ఉన్నారు.